ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 19 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - మంగళవారం
సాయంత్రం - 6.32
సహర్ - బుధవారం
ఉదయం - 4.59

పదో తరగతి పరీక్ష ప్రశాంతం

- మొదటి రోజు 50,790 మంది విద్యార్థులు హాజరు
- శంషాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 18 : మొదటి రోజు సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 239 పరీక్షా కేంద్రాల్లో 50,935 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 50,790 మంది హాజరయ్యారు. 99.71 శాతం అటెండెన్స్ నమోదైంది. ప్రైవేట్ విద్యార్థులకు సంబంధించి 84మందికి 59మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 2,450 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎప్పటికప్పుడు తనిఖీ చేశారు. ఈ సారి నిమిషం నిబంధనను ఎత్తివేయడంతో 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను అనుమతించారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. శంషాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ శశాంక్ తనిఖీ చేశారు. పరీక్షల్లో పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట శంషాబాద్ తహశీల్దార్ నాగమణి, అధికారులున్నారు.



ఆమనగల్లు బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



షాబాద్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు





ఇబ్రహీంపట్నం : పరీక్ష రాసేందుకు డీసీఎంలో వస్తున్న విద్యార్థులు



శంషాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక్



ఇబ్రహీంపట్నంలో...





చేవెళ్ల ఎంపీ టికెట్ తనకు దక్కుతుందా? లేదా? అనే మీమాంసలో వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఉన్నారు. ఆమె చేవెళ్ల టికెట్ ఆశించి ఎంతో ఉత్సాహంతో కుమారుడితో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. ఎంపీగా గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టాలని తలంచారు. అయితే హఠాత్తుగా సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆయనకే టికెట్ కేటాయిస్తారనే ప్రచారం జోరందుకుంది. దీంతో మొదట తనకు టికెట్ ఇస్తామని పార్టీలోకి రప్పించుకొని ఇప్పుడు వేరే వ్యక్తిని చేర్చుకోవడంపై ఆమె అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. మల్కాజిగిరి స్థానం నుంచి పోటీకి ఆమె సుముఖంగా లేనట్టు సమాచారం.

కింకర్తవ్యం?

చేవెళ్ల టికెట్ దక్కుతుందో లేదోనని సునీతారెడ్డి నారాజ్!

- రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో మారిన సమీకరణాలు
- సిట్టింగ్ ఎంపీకే టికెట్ అని జోరుగా ప్రచారం
- చేవెళ్ల టికెట్ చేజారిందన్న భావనలో సునీతారెడ్డి
- మల్కాజ్‌గిరి నుంచి పోటీకి మహిళా నేత విముఖత
- రాజకీయ భవిష్యత్తుపై మల్లగుల్లాలు

వికారాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి సన్నద్ధమైన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి చుక్కెదురైంది. చేవెళ్ల ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని ఆశించిన ఆమె ఆకాంక్ష సాకారమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. చేవెళ్ల ఎంపీగా పోటీ చేయాలనే లక్ష్యంతోనే సునీతారెడ్డి తన కుమారుడితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. పార్టీలో చేరిన తరువాత పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ తమ వెన్నంటి ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ వైపు తిప్పుకోగలిగారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తమకు మద్దతిచ్చిన నాయకులను చాలామందిని ఆమె ఇప్పటికే కాంగ్రెస్‌లో చేర్పించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సునీతారెడ్డి పోటీ చేస్తారని పార్టీ శ్రేణులూ నిర్ణయించుకున్నాయి. చేవెళ్ల నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసేది తానేనని ధీమాతో ఉన్న సునీతారెడ్డి తనకు టికెట్ కేటాయింపులో అవాంతరాలు ఎదురవుతాయని ఊహించలేకపోయారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో చేవెళ్ల నుంచి పట్నం సునీతారెడ్డి పేరు ఉన్నా.. ఆ తరువాత పార్టీ ప్రకటించిన జాబితాలో చేవెళ్ల అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా సునీతారెడ్డి పేరును తొలి జాబితాలోనే ప్రకటిస్తారని ఆశించిన ఆమె వర్గీయులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తొలి జాబితాలో చేవెళ్ల అభ్యర్థిని ప్రకటించకపోవడంతో రాజకీయంగా ఏదో జరుగుతోందన్న ప్రచారం ఊపందుకుంది. ఆ తరువాత రాజకీయంగా చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలతో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డే అనే విషయం పార్టీ శ్రేణులకు స్పష్టత వచ్చింది. అధికారికంగా ప్రకటించకపోయినా.. కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలో నిలిచేది ఆయనేనన్న సంకేతాన్నీ పార్టీ ఇచ్చింది. కాంగ్రెస్ తొలి జాబితాలో ఉన్న సునీతారెడ్డి పేరును సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కోసమే తప్పించి చేవెళ్ల అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టారనే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది.

చేవెళ్ల నుంచి పోటీ చేసి గెలిచిన పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని పట్టుదలతో ఉన్న సునీతారెడ్డి ఆకాంక్షను అనూహ్యంగా చోటుచేసుకున్న పరిణామాలు నీరుగార్చాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో సునీతారెడ్డి ఆశలకు గండికొట్టినట్టయింది. దీంతో ఆమె తన రాజకీయ భవితవ్యంపై ఆలోచనలో పడ్డారని తెలుస్తోంది. చేవెళ్ల నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చి.. సునీతారెడ్డిని మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరక ముందు నుంచే చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో రాజకీయ సమీకరణలను సిద్ధం చేసుకున్న సునీతారెడ్డి.. ఊహించని హఠాత్పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. చేవెళ్లకు బదులుగా మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసేలా సునీతారెడ్డిని ఒప్పించే ప్రయత్నాలను పార్టీ నాయకులు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తామని పార్టీ ముఖ్య నేతలు ఆమెకు భరోసా ఇస్తున్నా.. అక్కడి నుంచి పోటీకి సునీతారెడ్డి విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది తన రణక్షేత్రం కాదని, రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచీ తనకు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతోనే ఎక్కువ అనుబంధం ఉందని, కొత్తగా మల్కాజిగిరిలో పోటీ అంటే రిస్కే అనే అభిప్రాయంలో ఆమె ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై ఆమెతో మాట్లాడేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

డీలాపడ్డ సునీతారెడ్డి.. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తారా?



సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

- ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రకటించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నివాసంలో సోమవారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ముక్తకంఠంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండుసార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుండి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరినీ ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుండి వ్యతిరేకత ఎదుర్కొంటుందని, కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని వారన్నారు. త్వరలో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతీ ఒక్కరు సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గె మల్లేశం, దయానంద్ గుప్తా మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిగూడలో బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

తిమ్మారెడ్డిగూడలో ఘనంగా బీరప్ప బోనాలు

షాబాద్, మార్చి 18 : తిమ్మారెడ్డిగూడలో సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో బీరప్ప బోనాలు సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును నిర్వహించారు. గ్రామస్తులంతా బీరప్ప ఆలయానికి తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ మద్దూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ: కలెక్టర్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని తెలిపారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున అనుమతులు లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. ముందస్తుగా అనుమతి తీసుకున్న మీదటే సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని, నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై సంబంధిత చట్టాలను అనుసరిస్తూ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే సీ-విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు. 85 సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసే వెసులుబాటు ఉందని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల లోపు, అంటే ఏప్రిల్ 22లోపు 12-డి ఫారం భర్తీ చేసి బీఎల్వోలకు ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. ఈ మేరకు ముందస్తుగానే వారికి బీఎల్వోల ద్వారా ఫారం 12-డి అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు తగిన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఏసీపీ శంషాబాద్ కె.ఎస్.రావు, సీపీవో సౌమ్య, డీపీవో సురేష్ మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ప్రచార సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రచార సభలకు ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీల తరఫున కృషి చేయాలని కోరారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, అయితే కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు, కరపత్రాలలో ముద్రించే అంశాలు, ఇతర ప్రచార అంశాలకు సంబంధించి తప్పనిసరిగా ఎంసీఎంసీ ద్వారా ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కిస్తామని కలెక్టర్ శశాంక తెలిపారు. రాజేంద్రనగర్ తహశీల్దారు కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికల నామినేషన్లు స్వీకరిస్తారని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది వివరాలను అందించాలి

పార్లమెంటు ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు వివిధ శాఖల సిబ్బందికి సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిబ్బందికి సంబంధించిన ఇంటి చిరునామాలు, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా అందించాలన్నారు. సిబ్బందికి సెలవులు ఇవ్వరాదని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అధికారుల తీరుపై ఆగ్రహం

దోమ, మార్చి 18: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు సీసీ రోడ్ల నిర్మాణంలో తీర్మానాలు చేయకుండా అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాయం పట్ల వైస్ ఎంపీపీ మల్లేశం, బొంపల్లి ఎంపీటీసీ రాములు పంచాయతీరాజ్ శాఖ అధికారి లక్ష్మయ్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. మన ఊరు, మన బడి కార్యక్రమంలో పనులు చేపట్టి సంవత్సరం గడుస్తున్నా బిల్లులు అందలేదని అధికారుల తీరుపై ఎంపీటీసీ రాములు మండిపడ్డారు. బొంపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో పనులు చేయకుండానే బిల్లులు చేసిన వారిపై లక్ష వరకు రికవరీకి ఆదేశించినా ఇప్పటి వరకు ఎంత రికవరీ చేశారని ఏపీవో దస్తయ్యను నిలదీశారు. గొన్ననాయక్ తండా, పాశంబండ తండా, హేట్యనాయక్ తండాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కాపోవడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైస్ ఎంపీపీ మల్లేశం ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నర్సింహులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీవో మహేశ్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బొంపల్లి ఎంపీటీసీ రాములు

ఎమ్మెల్యేతో ఎంపీ భేటీ



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు: మార్చి 18: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సోమవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. ఆయనవెంట నాయకులు పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, అబ్దుల్ రవూఫ్ ఉన్నారు.

లంచం డిమాండ్ చేసిన ఉద్యోగి సస్పెన్షన్

కీసర, మార్చి 18: లంచం డిమాండ్ చేసిన ఉద్యోగిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. కీసర తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి పథకానికి లబ్ధిదారుల వద్ద లంచం డిమాండ్ చేశారని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్‌దిప్రెస్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఓ విలేకరిని ప్రశ్నించిన విషయం తెలిసిందే. కాగా ఇట్టి విషయంపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. భోగారం గ్రామానికి చెందిన రేణుకా అనే మహిళ కొన్ని రోజుల కిందట కల్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చింది. దీంతో కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ రమేష్ రేణుకను లంచం డిమాండ్ చేసినట్లు తమ విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయగా సోమవారం మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ జూనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ గతంలో కామారెడ్డిలో వీఆర్ఏ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేసి కీసర తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ పొందినట్లు తెలిపారు.

తల్లి, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సీడీపీవో కాంతారావు

బంట్వారం, మార్చి 18: తల్లి, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ మర్పల్లి ప్రాజెక్ట్ సీడీపీవో కాంతారావు అన్నారు. మండలంలోని బాపునారంలో సోమవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ధనలక్ష్మి, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, యశోద పాల్గొన్నారు.

కులకచర్ల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని పరిగి సీడీపీవో ప్రియదర్శిని తెలిపారు. కులకచర్లలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, పద్మ, మండల సూపర్‌వైజర్ యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


సొంత గూటికి బాలేశ్వర్ గుప్తా



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా


తాండూరు: మార్చి 18: తాండూరులో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. యాలాల ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. గతంలో బీజేపీలో పని చేసిన బాలేశ్వర్‌గుప్తా తర్వాత కాంగ్రెస్ నుంచి ఎంపీపీగా ఎన్నికై బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి సోమవారం సొంతగూటికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం ఉన్నారు.













వైభవంగా శ్రీమల్లికార్జునస్వామి జాతర


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

శామీర్‌పేట, మార్చి 18: శామీర్‌పేటలోని మల్లికార్జున స్వామి జాతర, కల్యాణోత్సవాన్ని సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమల్లికార్జున స్వామి వారిని ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు, వివిధ పార్టీల నాయకులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అదేవిధంగా మధ్యాహ్నం స్వామివారి కల్యాణం, భక్తుల కోలాహలం మధ్య బ్రాహ్మణుల మంత్రోచ్చరణలతో కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు, ఓడిబియ్యం, బోనాల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం శామీర్‌పేట మాజీ సర్పంచ్ కిశోర్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిబాబు, వివిధ పార్టీల నాయకులు వజ్రేష్‌యాదవ్, విక్రమ్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, ఎనుగు సుదర్శన్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, వైఎస్‌గౌడ్, ముజీబుద్దీన్, అశోక్, వివిధ గ్రామల నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలను నిర్వహించారు. అనంతరం వారిని యాదవసంఘం నాయకులు సన్మానించారు.

నేటి నుంచి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పరిగి, మార్చి 18: పరిగిలోని బాలాజీనగర్‌లో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. విశాలమైన ప్రదేశంలో ఆలయప్రాంగణంలో ప్రతీ ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ జాతర ప్రతీ ఏడాది పాల్గుణ మాసంలో మూడు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈ ఆలయాన్ని నిర్మించి 37ఏళ్ల పూర్తయింది. గతంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగేవి. అయితే ఈసారి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈసారి పెద్దఎత్తును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొడంగల్ చౌరస్తాలో గల విశాల స్థలంలో స్వామివారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో తిరుమల తిరుపతి దేవాలయం వారు కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ బ్రహ్మోత్సవాలకు పరిగి పరిసర ప్రాంత గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాలకు వస్తుంటారు. జాతరకు వేల మంది భక్తులు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వెంకన్నగా పేరుగాంచిన ఈ ఆలయం ఉత్సవాలకు అధికసంఖ్యలో భక్తులు రావడం విశేషం. ఇక్కడ ఉత్సవాలకు ప్రత్యేక దుకాణాలు వెలుస్తాయి. ఈ మూడురోజుల పాటు ప్రత్యేక భజనలు జరుగుతాయి. ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ఆలయంలో వెలసిన స్వామి, అమ్మవార్లు


పరిగిలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం

బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాల వివరాలు

మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న మంగళవారం ఉదయం 8గంటలకు గణపతి పూజ, విశ్వకేన పూజ, పుణ్యావచనం, స్వామివారికి అభిషేకం, ధ్వజారోహణం, పంచగ్యపాశణ, గోవు పూజ, మృత్యుగ్రహణం, అంకుర్పాణం, దీక్షాదారణం, రుత్సాంగవణం, సాయంత్రం తులసి అర్చన, కుంకుమ అర్చన, సాయంత్రం ఎదురు కోళ్ళు ఉంటాయి. 20న బుధవారం ఉదయం ప్రాతకాలపూజలు, హోమాలు, అభిషేకలు, చండీ హోమం, సాయంత్రం 4గంటలకు సామూహిక కుంకుమార్చన, ఎదురుకోళ్ళు ఉంటాయి. 21న గురువారం ఉదయం వేదపారాయణం, స్వామివారికి అభిషేకాలు, హోమాలు శ్రీలక్ష్మీహోమం, శ్రీవెంకటేశ్వరహోమం, ఆంజనేయ నాగ, ధ్వజహోమం, మహాపూర్ణాహుతి, 11.45గంటలకు శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం స్వామివారి ఉరేగింపు ఉంటుంది. ప్రతీరోజు సాయంత్రం ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు అన్నదానం చేయనున్నారు.


పోషకాహారల గురించి వివరిస్తున్న అంగన్ వాడీ టీచర్లు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కడ్తాల్, మార్చి 18 : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో రోజా అన్నారు. కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ నీలవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గు రించి అంగన్‌వాడీ టీచర్లు సుగుణమ్మ, లీలావతి గర్భిణీలకు, తల్లులకు, కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ రాము నాయక్, అంగన్‌వాడీ టీచర్ మంజుల తదితరులు పాల్గొన్నారు

కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తి చేయాలి



వికారాబాద్, మార్చి 18 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సీసీ రోడ్లకు సంబంధించి, లేబర్ మొబిలైజేషన్‌కు సంబంధించి దిశానిర్దేశం చేశారు. గ్రామ పరిధి ఎన్ఆర్ఈజీఎస్ వ్యవస్థను బలోపేతం చేసి కూలీల సంఖ్యను పెంచుతూ పనులు పూర్తి చేయించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని చిన్న చిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో తప్పనిసరిగా జనరేట్ చేయాలని, ఏ మండలంలో ఏ తేదీ వరకు ఎఫ్‌టీవో జనరేట్ అయింది.. చేయాల్సిన పనులు ఎన్ని ఉన్నాయో చెక్ చేసుకొని టీఏలంతా ప్రణాళికాబద్ధంగా ఎఫ్‌టీవో జనరేట్ చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- భారీగా తరలివచ్చిన భక్తులు , నేతలు


ఉత్సవాలను ప్రారంభిస్తున్న లీలాలక్ష్మారెడ్డి, మొళ్లారి వెంకటేశ్వర శర్మ

కడ్తాల్, మార్చి 18 : కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన సీతారామ చంద్రస్వామి, శివపార్వతులు, సరస్వతిదేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే వేడుకలకు ఆలయ నిర్వాహకులు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయ క్షేత్రాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా, అలంకరించారు. భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రారంభ వేడుకలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఫిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలి రోజు ప్రముఖ వేద పండితుడు మొళ్లారి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. 20న విగ్రహప్రతిష్ఠ నేపథ్యంలో ప్రముఖుల రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కోర్పోలు కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, స్వదీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శంకర్, రామకృష్ణ, పర్వతాలు, పాల్గొన్నారు.


కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఆదిభట్ల, మార్చి 18 : మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రతి ఆదివారం కార్మికులకు సెలవు రోజుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ నాయకులు, అధికారుల వేదింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులను తరచూ సూపర్‌వైజర్‌లు వేధించడం సరికాదన్నారు. కార్మికులకు ప్రతి ఏటా రెండు జతల దుస్తులతోపాటు సబ్బు, నూనెల డబ్బులు అడ్వాన్స్‌గా ఇవ్వాలని అన్నారు. కార్మికులను బదిలీ చేయడం అధికారులు తక్షణమే మానుకోవాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ ఎస్.బాలకృష్ణకు అందించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, జగన్, అనిల్, బాబు, ఉపేందర్, తులసీ తదితరులున్నారు.


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

వికారాబాద్, మార్చి 18: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్పీకర్ నివాసంలో విశ్రాంత ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించేలా కృషిచేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.



ఈము రైతుల సమస్యలపై స్పందిస్తున్న ప్రభుత్వం

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, నాబార్డు సంస్థ ఆర్థిక సహకారంతో ఈము పక్షుల పెంపకాన్ని చేపట్టి అప్పులపాలై ఈము రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తున్నదని ఈము పక్షుల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. అప్పులిచ్చిన బ్యాంకుల వత్తిడితో ఆస్థులను కోల్పోతున్న తమ సమస్యలపై రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రాలు ఇవ్వడంతో సమస్య పరిష్కారం కోసం చొరవ చూపుతున్నారని అన్నారు. ఈ మేరకు ఈనెల 14న జరిగిన బ్యాంకర్ల రాష్ట్ర స్థాయి సమావేశంలో సైతం ఈము రైతుల సమస్యలను ఇద్దరు మంత్రులు ప్రస్తావించి, సమస్యను పరిష్కరించాలని బ్యాంకర్లను ఆదేశించడంతో ఈము రైతులకు కొంత ఊరట లభిస్తున్నదని పేర్కొన్నారు. నాబార్డు ముందుకు వచ్చి ప్రతి యూనిట్‌కు 25శాతం సబ్సిడీతో 30లక్షల రూపాయల రుణం ఇవ్వడంతో తెలంగాణాలోని 118 మంది రైతులు ముందుకు వచ్చి ఈము పక్షుల పెంపకాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ఈము పక్షులను పెంచిన రైతులకు ప్రభుత్వాలు మార్కెటింగ్‌ను చూపించకపోవడంతో పోషణ భారమైందని చెప్పారు. బ్యాంకర్ల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే ఒక రైతు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు యత్నించారని తెలిపారు. ఈము రైతులు పది సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యపై పూర్తి అవగాహనతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందిస్తున్నారని, సమస్య త్వరలో పరిష్కరించాలని వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు.

కనుల పండువగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు


ఆమనగల్లు అలివేలు మంగసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆమనగల్లు, మార్చి 18: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆమనగల్లు పట్టణంలోని శ్రీవెంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం అలివేలుమంగ సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ఆవరణలో చలువ పందిర్లు ఏర్పాటుచేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి ఆమనగల్లు పట్టణంతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, మహబూబ్‌నగర్ సహా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో మేళతాళాలు , వేద మంత్రాల నడుమ అర్చకులు జానకి రామయ్య, శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, శ్రీకాంతాచార్యులు, చైతన్యాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి కట్టా శాంతమ్మదేవేందర్, బికుమాండ్ల సుజాతనర్సింహ్మా, పుష్పలతసోమశంకర్, రాజేశ్వరిరాజ్‌గోపాల్, తనుశ్రీ సత్యం, జ్యోతికొండల్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. నాట్యమయూరి శాన్వి నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. ఆమనగల్లుకు చెందిన కండె సీతమ్మలింగయ్య దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోనిజయరామ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సతీమణి గీత, ,అనిల్ కుమార్, వెంకటరమణాచారి, సంజిత్ పాండే, మల్లిఖార్జున్, ఆనంద్ లు కండె భాస్కర్, కండె సుమన్, బికుమాండ్ల పాండయ్య, పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేస్తాం


రామన్నగారి మణికంఠగౌడ్‌కు కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్, వజ్రేష్‌యాదవ్

మేడ్చల్ టౌన్, మార్చి 18: రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీలో జెండా మోసేవారు ఉండరని డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠగౌడ్ సోమవారం దాదాపు 500మందితో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చేరికల బహిరంగసభకు హరివర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని సమర్థిస్తూ ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ప్రధానంగా సమీప కాలంలో బీఆర్ఎస్‌పార్టీ పూర్తిగా ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. ఆపార్టీలో జెండా మోసేవారు కూడా ఉండబోరన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచాతప్పకుండా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. మేడ్చల్ ప్రజలకు సుదీర్ఘకాలం పాటు సేవలందించిన మాజీ సర్పంచ్ దివంగత చిలుక రాజు తనయుడు మణికంఠగౌడ్ కాంగ్రెస్ పార్టీలో రావడం ప్రశంసనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. కనీవినీ ఎరుగని తరహాలో మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో పలువురు కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయమన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన చాలామంది తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో నాయకత్వం లేక పోవటంతో అనేక ఇబ్బందులు పడ్డామని కౌన్సిలర్ మణికంఠ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి దగ్గర నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ వరకు ప్రజల బాగోగులను పక్కనబెట్టి సొంత ప్రయోజనాల కోసం పని చేసేవారని ఆరోపించారు. డబ్బులతో రాజకీయం చేసే నేతలకు తగిన గుణపాఠం నేర్పాలన్న ఉద్దేశ్యంతో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికంఠ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ సెల్‌అధ్యక్షుడు సయ్యద్ లాయక్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీక్, బీసీ నాయకుడు నడికొప్పు బాల మల్లేష్, రమేష్, నర్సింహా పార్టీలో చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల నర్సింహారెడ్డి, రమణారెడ్డి, చాప రాజు, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, పోచయ్య, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆమనగల్లు పట్టణంతో పాటు కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, కొత్తూరు, షాద్‌నగర్, చేవెళ్ల, మొయినాబాద్, యాచారం, మాడ్గుల, మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం, చౌదరిగూడ, కొందుర్గు, షాబాద్ మండలాల్లో పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కొత్తూర్ : పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు


ఆమనగల్లులో పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు


చేవెళ్ల : పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు


కడ్తాల : తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సీఎంకు వినతి


సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న క్యామ రాజేశ్

కడ్తాల్ , మార్చి 18 : కడ్తాల మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ రాజేశ్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్ లోని సీఎం నివాసంలో ఆయనను రాజేశ్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు రాజేశ్ తెలిపారు.

ఘనంగా శివాలయ ప్రాణప్రతిష్ఠ

చేవెళ్ల, మార్చి 18 : చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో సోమావారం సహజ బ్రహ్మ సూత్ర శివాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం గ్రామంలో కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మహాలింగేశ్వర, పార్వతీమాత విగ్రహాలకు ప్రత్యేక పూజ నిర్వహించారు. అలాగే దేవాలయం ప్రాంగణంలో దంపతులు పెద్ద సంఖ్యలో కూర్చుని హోమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కౌకుంట్ల అధ్యక్షుడు సారా శివకుమార్, ఆలయ ధర్మకర్త పట్లోళ్ల లక్ష్మారెడ్డి, కరణ్‌జీ, బుషీకేష్‌గౌడ్ నిర్వాహకులు, భక్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.

శ్రీ వేంకటేశ్వర కల్యాణోత్సవంలో కొండా దంపతులు

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని రామాంజాపూర్ వెంకటేశ్వర ఆలయంలో వెంకటేశ్వర స్వామి కల్యాణత్సోవాలు కన్నుల పండగా జరిగాయి. ఈ ఉత్సవానికి చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశేశ్వంర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఆలయంలో జరిగిన హోమం, కల్యాణోత్సవంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితోపాటు మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్ని వేదా పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ఆయన పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ....మాపై వెంకటేశ్వర స్వామి అశీస్సులు ఎప్పుడు ఉంటాయని మరోసారి చేవెళ్ల గడ్డ నుంచి ఎంపీగా గెలిచిన ఢిల్లీ పార్లీమెంట్‌లో తెలుగు వాడి వాని వినిస్తున్నాని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని చెప్పారు. ఆయన భార్య సంగీతారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేంరాజ్, కౌన్సిలర్ మెంబర్ ప్రభాకర్, సర్పంచ్ నర్సమ్మ, బీజేపీ నాయకులు ప్రవీణ్‌కుమార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిది అవకాశవాదం

మొయినాబాద్, మార్చి 18 : చేవెళ్ల ఎంపీ. రంజిత్‌రెడ్డి అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్ ఎస్ మండల సీనియర్ నాయకులు కృష్టారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మొయినాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ. రాజకీయ అనుభవం లేని రంజిత్‌రెడ్డిని గత పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకొచ్చి చేవెళ్ల ఎంపీగా గెలిపించారని గుర్తు చేశారు. ఇంతకాలం అధికారంలో ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి రాగానే ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఆయన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ ఇతర వ్యాపారాలు చేసి వేల కోట్లు సంపాదించారని చెప్పారు. ఆ ఆస్తులను కాపాడుకోవడం కోసమే అధికార యావతో కాంగ్రెస్‌లో చేరారాని విమర్శించారు. చేవెళ్ల ప్రజలు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఇలాంటి అవకాశవాద రాజకీయ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం

కందుకూరు,మార్చి 18: చేవెళ్ల పార్లమెంట్ నుండి బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపు ఖాయమని, ఆదిశగా పార్టీ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కలిసి పనిచేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి కోరారు. సోమవారం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ యువనేతలు నగరంలోని ఆమె నివాసినికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గడచిన పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన సేవలను ఈ ప్రాంత ప్రలు. రైతులు, మహిళలు మరువలేరన్నారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలకు మాయమాటలు చెప్పి ఎన్నికల్లో లబ్ధి పొందారని, కాని వారు అధికారంలోకి వచ్చి వంద రోజులైన నేటికి రైతులకు రైతు బంధు, రుణమాఫీ, నిరంతరాయమైన విద్యుత్ లాంటి పథకాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు.వీటిని ప్రతి రెతుకు, రైతు కూలీలకు, మహిళలకు వివరిస్తూ.... ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యువనేతలు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి,గొరెంకల రామక్రిష్ణ, డి.రాఖేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, మార్చి 18 : తలకొండపల్లి మండల పరిధిలోని కల్కిదోన గోపాల స్వామి గుట్టపై గల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు, ముఖ్యంగా మహిళలు తలంబ్రాలతో కల్యాణానికి హాజరయ్యారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ సిద్దాంతి, పట్టాభి రామ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణమూరి, శ్రీనివాస శర్మ స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బికుమాండ్ల శ్యామ్‌సుందర్, అనుదీప్, సాయితేజ, మాధురి, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నేటి నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : కడ్తాల మండలం రావిచేడ్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. నేటి నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. రావిచేడ్‌తో పాటు కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, కేశంపేట, కందుకూరు, మహేశ్వరం నుంచి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ అర్చకుడు వింజమూరి రామానుజాచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతాయి. నేటి నుంచి 23 వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయి.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

చౌదరిగూడ, మార్చి 18 : అభివృద్ధికి ఆకర్షితులై నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలోకి వలసలుగా వస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ రావుల మంగమ్మ ఎమ్మెల్యే సమక్షంలో షాద్‌నగర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ఆమెకు పార్టీకి కండువా కప్పి ఆహ్వానించారు.


ఎంపిటిసి మంగమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్ : కొత్తూర్ మున్సిపాలిటీకి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ కమ్మరి జయమ్మ భర్త కమ్మరి జనార్ధన్‌చారి, 11వ వార్డు కౌన్సిలర్ ప్రసన్నలత భర్త యాదయ్యలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేసి సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

షాద్‌నగర్‌అర్బన్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కోట్ల శ్రీశైలం సోమవారం షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

షాద్‌నగర్‌అర్బన్ : మున్నూరు కాపులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో సోమవారం షాద్‌నగర్ మున్నూరు కాపు సంఘం ఎమ్మెల్యేను సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలని శంకర్ కోరారు. మున్నూరు కాపుసంఘం షాద్‌నగర్‌శాఖ అధ్యక్షుడు మేడిగ పెంటయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయికృష్ణ, నారాయణ, మురళీ, ఎస్. చంద్రశేఖర్, పాల్గొన్నారు.

చౌదరిగూడ : మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణపూర్ మాజీ సర్పంచ్ శివమోగిలి యాదవ్ సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యం

ఆమనగల్లు , మార్చి 18: ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి నూదిని రాంరెడ్డి, కార్యవర్గ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు నిచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని వారు కోరారు. ఆమనగల్లు పట్టణం సమీపంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధిని కాంక్షించి ఎంపీటీసీ, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. సమావేశంలో జడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీలు కమ్లీమోత్యానాయక్, అనితవిజయ్, పద్మారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

యాచారంలో వాహనాల తనిఖీ

యాచారం, మార్చి 18 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారులు ఎన్నికల నిర్వాహణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ పత్రాలు లేని వారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

బహుజనులకు అధికారమే లక్ష్యం

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 18 : బహుజనుల అధికారమే లక్ష్యంగా పేదల పక్షాన పోరాడుతానని బీఎస్పీ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయ పదవుల కోసం దొర పంచన చేరి, పేదలకు నయవంచన చేశాడని ఆ పార్టీ షాద్‌నగర్ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ బహుజన పేదల కోసం పని చేస్తున్నాడని నమ్మి, ఆయనకు అండగా నిలిచామని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో పొత్తుకు బీఎస్పీ అధినేత్రి ఒప్పుకోకపోవడంతో బీజేపీపై ఆరోపణలు చేస్తూ, ఏకంగా బీఆర్ఎస్‌తో చేతులు కలిపి నమ్ముకున్న వారిని నట్టేట ముంచాడని విమర్శించారు. ప్రవీణ్‌కుమార్ ఎప్పటికి ప్రజాసేవకుడు కాలేడని అన్నారు. మోసపూరిత రాజకీయాలు చేస్తున్న ఆయన మాయమాటలను ప్రజలు నమ్మవద్దని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.



బాధితురాలికి ఆర్థిక సాయం

తలకొండపల్లి , మార్చి 18: మండల పరిదిలోని దేవుని పడకల్ గ్రామానికి చెందిన ముత్యాలమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సోమవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు , శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం లు ఆసుపత్రికి వెళ్లి ముత్యాలమ్మను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చికిత్స నిమిత్తం కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, శ్రీశైలం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పద్మ, సత్యం, బిక్షపతి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

ఆమనగల్లు , మార్చి 18:ఆమనగల్లు పట్టణానికిచెందిన ఓ నిరుపేద కుటుంబానికి పోలీసులు చేయూతనందించారు. జీవనానికి ఇబ్బంది పడుతున్న నిరుపేద మహిళకు కానిస్టేబుల్ రజనికాంత్ సోమవారం నిత్యావసర సరుకులు సమకూర్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాల్‌రెడ్డి, యాదయ్య, కౌన్సిలర్ కృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో గ్రామకార్యదర్శుల నిరసన

కొత్తూర్, మార్చి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కొడేరు మండల ఎంపీవోపై మహిళ ఎంపీపీ దాడిని నిరసిస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం గ్రామ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి సురేందర్‌లు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న గ్రామకార్యదర్శులు

క్రైం కార్నర్

షాద్‌నగర్ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న మారుతీ వ్యాన్
- ఇద్దరి దుర్మరణం, నలుగురికి తీవ్ర గాయాలు
- మైసూరు నుంచి భక్తులు కాశీ వెళ్తుండగా ప్రమాదం బారిన

షాద్‌నగర్ రూరల్, మార్చి 18 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. షాద్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన రత్నాకర్, నర్సింహన్‌అయ్యర్(47), విశ్వనాథన్‌అయ్యర్(43), రఘురాం, మదన్‌కుమార్, శ్రీరాంలు ఓ మారుతీ ఓమ్ని వ్యాన్‌లో మైసూరు నుంచి కాశీ వెళుతున్నారు. వారి వాహనం బైపాస్ రోడ్డులోని హనుమాన్ ఆలయం సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. దీంతో రత్నాకర్, నర్సింహన్ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మదన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ వ్యాన్‌ను అజాగ్రత్తగా, వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు అభిప్రాయపడ్డారు.


నుజ్జునుజ్జయిన కారు

సింగర్ మంగ్లీకి తప్పిన ముప్పు

శంషాబాద్ రూరల్, మార్చి 18 : ప్రముఖ సింగర్ మంగ్లీ కారును వెనుక నుంచి ఓ డీసీఎం వ్యాన్ ఢీకొన్న సంఘటన రెండు రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న నందిగామలోని కన్హా శాంతివనంలో జరుగుతున్న ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవానికి మంగ్లీ హాజరయ్యారు. ఆమె తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై శంషాబాద్ పట్టణ సమీప తొండుపల్లి ఫ్లైఓవర్ వద్ద కర్ణాటకకు చెందిన ఓ డీసీఎం వెనుక నుంచి మంగ్లీ కారును ఢీకొంది. దీంతో ఆమె కారు స్వల్పంగా దెబ్బతింది. కారులో ఉన్న మంగ్లీ, మేఘరాజ్, మనోహర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు. మంగ్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.


దెబ్బతిన్న మంగ్లీ కారు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ఇబ్రహీంపట్నం, మార్చి 18 : ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి దండుమైలారం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఓ యువతి అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఎవరో ఉరేసి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దండుమైలారం గ్రామానికి చెందిన మోటె జంగమ్మ, అయిలయ్యకు ఓ కూతురు, ఇద్దరు కుమారులున్నారు. కూతరు భార్గవి(19) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా సోమవారం మధ్యాహ్నం భార్గవి ఇంట్లోనే శవమై ఉండడాన్ని తల్లిదండ్రులు గమనించారు. ఆమె మెడపై గాట్లు ఉన్నాయి. ముక్కునుండి రక్తం కారుతోంది. కాగా భార్గవి మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. తాము పొలం పనికి వెళ్లామని, వచ్చి చూసే సరికి తమ కూతురు మృతి చెంది ఉందని తల్లిదండ్రులు చెబుతున్నారు. క్లూస్ టీంను రప్పించి పోలీసులు వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ముందు వెళ్తున్న కారు ఢీకొన్న మరో కారు

శంషాబాద్ రూరల్, మార్చి 18 : ఔటర్ రింగ్ రోడ్డుపై ముందు వెళ్తున్న ఓ కారును మరో కారు ఢీకొన్న ఘటన సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా బీరంగూడకు చెందిన శివరాత్రి వెంకన్న తన బ్రిజా టీఎస్ 14 ఈఎక్స్ 8762 కారులో సూర్యాపేట నుంచి పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో పెద్దగోల్కొండ వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన ఏపీ 39 కేకే 2033గల ఎస్‌క్రాస్ కారు బలంగా ఢీకొంది. దీంతో ముందున్న కారు బోల్తా కొట్టింది. అయితే కార్లలో ఉన్న ఎవరికి ఎలాంటి గాయలు కాలేదని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌క్రాస్ డ్రైవర్ సందీప్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

ఘనంగా దేవేందర్‌గౌడ్ జన్మదిన వేడుకలు


దేవేందర్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఈటల రాజేందర్, తదితరులు

మహేశ్వరం, మార్చి 18 : మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్ 71 జన్మదిన వేడుకలు సోమవారం మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఆయన అభిమానులు రక్తదానం చేశారు. బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, కె.ఎస్. రత్నం, మనోహర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, బొక్కనర్సింహారెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, పాపయ్యగౌడ్, హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుయాష్కిగౌడ్, టీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్ తధితర నాయకులు హాజరై దేవేందర్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్‌గౌడ్ కుటంబసభ్యులు విజయేందర్‌గౌడ్, టి. శ్వేత, వినయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, కాటం భాస్కర్‌గౌడ్, రాజమోని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

కొందుర్గు, మార్చి 18 : ఎమ్మెల్సీ, లోకసభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి చర్చలు జరగకుండానే ముగిసింది. సమావేశానికి పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రాజేష్‌పటేల్, ఎంపీడీవో అంజనేయులు, ఎంపీవో లాలయ్య, ఎంపీటీసీ సభ్యులు రాంరెడ్డి, మంజుల మల్లేష్‌గౌడ్, ఇస్తారమ్మ, సీడీపీవో నాగమణి, డిప్యూటీతహసీల్దార్ కృష్ణయ్య, పీఆర్ ఏఈ దయాకర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్, ఇరిగేషన్ ఏఈ క్రాంతి పాల్గొన్నారు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి

కొందుర్గు, మార్చి, 18: మహిళా సంఘాల నుంచి అప్పులు తీసుకున్న సభ్యులు సకాలంలో అప్పులు చెల్లించాలని ఏపీఎం జయమాలిని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మండలంలోని 22 గ్రామ సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయమాలిని మాట్లాడుతూ మండలంలో 22 గ్రామ సంఘాలు ఉన్నాయని, ప్రతీ నెల 2వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అయా గ్రామాల్లో గ్రామ సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ నెల 17వ తేదీన మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అయా సంఘాల సభ్యులు తీసుకున్న అప్పుల వివరాలు, కొత్తగా ఇవ్వాల్సిన రుణాలు, సంఘాలకు సంబంధించిన ఇతర విషయాలపై చర్చిస్తామని వివరించారు. సమావేశంలో ఎం.భారతమ్మ, వీరమణి, అపర్ణ, ఆగిర్యాల భారతమ్మ, అనిత, కవిత, బాలమణి, పుష్పమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు: ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా ఎండీ. ఫరీద్ నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి.

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు.

మాడ్గుల : మాడ్గుల తహసీల్దార్‌గా సునీల్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన ఆయన మాడ్గుల తహసీల్దార్‌గా వచ్చారు.

మాడ్గుల :బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు అతెల్లి సుజిత్, కొప్పుల శేఖర్‌గౌడ్, సైదులు మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు.

కొత్తూర్ : మున్సిపాలిటీలోని ఎస్సీ వాడలోని అంగన్‌వాడీ కేంద్రానికి మున్సిపల్ కౌన్సిలర్ మాదారం నర్సింహగౌడ్ సొంత ఖర్చులతో వాటర్‌ట్యాంక్‌ను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఆయనకు అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కడ్తాల్ : విద్యార్థులు పరీక్షల భయం, ఒత్తిళ్లను వీడి ఏకాగ్రతతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పదో తరగతి విద్యార్థినిలకు సోమవారం జడ్పీటీసీ దశరథ్ నాయక్ పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు.

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని కొత్త పేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్, వంగేటి తిరుమల్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

చేవెళ్ల : ప్రజలు ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లా ఖాన్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మహలింగాపూర్ గ్రామంలో ఆన్‌లైన్ మోసాలు, అధిక వడ్డీలతో మోసపోవద్దని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మంచాల: మంచాల మండల పరిధి జాపాల జిల్లా పరిషత్ స్కూల్ 1992 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 32 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

యాచారం : ఏ ఒక్క గ్రామంలో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కృష్ణానీరు సరిపోకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో గూగుల్‌మీట్‌లో మాట్లాడారు. ఎంపీవో ఉమారాణి, ఏపీవో లింగయ్య తదితరులున్నారు.

యాచారం : రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని సోమవారం యాచారం మండల కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి, వి.తిరుమలేష్, బట్టుశ్రీనివాస్, ఉన్నారు.

నందిగామ: నందిగామ నాయీబ్రహ్మణ సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా రాంచంద్రయ్య, సభ్యులుగా రాజు, రమేష్, రాములు, మిట్టు, మల్లేష్‌లు ఎన్నికయ్యారు.

నందిగామ: నందిగామ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుప్పుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా పూర్ణం శ్రీకాంత్, ప్రదానకార్యదర్శిగా సందీప్, కోశాధికారిగా మధు సభ్యులుగా కిరణ్, రాజు, కృష్ణ, రమేష్, ఆనంద్, గణేష్, కరుణాకర్, సంపత్, బాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దార లింగం, కొమ్ము వెంకటయ్య నాయకులు దార సురేష్, స్వామి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

- నందిగామ: బీజేపీ మండలాధ్యక్షుడిగా చెన్నయ్యను బీజేపీ ఎన్నికల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్ గౌడ్‌లు చెన్నయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు. చెన్నయ్యను శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సింహగౌడ్ సన్మానించారు.
- **ఆమనగల్లు:** సహకార బ్యాంకుల ద్వారా నాబార్డ్ అందించే దీర్ఘకాలిక రుణ పరిమితిని రూ.1.50లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచాలని ఆమనగల్లు సొసైటీ చైర్మన్ డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ కోరారు. ఆమనగల్లు డీసీసీబీ పరిధిలో ఎకరా భూమి రూ.మూడు కోట్ల వరకు ధర పలుకుతున్న నేపథ్యంలో దీర్ఘకాలిక రుణ పరిమితిని పెంచాల్సిన అవసరముందన్నారు. హైదరాబాద్‌లోని నాబార్డ్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
- **మహేశ్వరం** : అసైన్డ్ భూములపై సంబంధిత రైతులకు సర్వహక్కులు కల్పించాలని అసైన్డ్ భూముల సర్వహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కటికెల శ్రీహరి ముదిరాజ్ అన్నారు. సోమవారం మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె. తిరుపతి, జి.నర్సింహ పాల్గొన్నారు.
- **చౌదరిగూడ:** చిరుధాన్యాల వాడకం ఆరోగ్యానికి మంచిదని షాద్‌నగర్ సీడీపీవో నాగమణి అన్నారు. సోమవారం తూంపల్లిలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పోషణపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు.